(న్యూజెర్సీ కథల పోటీ మంచి సాధారణ ప్రచురణకు ఎంపిక చేసిన కథ)

“ఏంటే మీ తమ్ముడు మొన్న ఆఫీసు పని మీద మన ఊరొచ్చి కూడా మనింటికి రాకుండా వెళ్ళిపోయాడన్నమాట. ఏమిటి

[redacted]

అతని ఉద్దేశం? అతనికి అన్న- వదినలు అక్కర్లేదా? ఎంత టైము లేకపోతే మాత్రం కనీసం ఒక్కసారి కన్పడి వెళ్ళొచ్చుగా! ఒక్కపూట భోజనం చేసి వెళ్ళేంత టైముదొరకదా ఏమిటి? ఈసారి, మీరు విశాఖపట్నం వెళ్తే మీరూ మీ త మ్ముడిలాగే మీ ఆఫీసు పనేదో చూసుకురండి గాని మీ తమ్ముడింటికి వెళ్తే ఊరుకోను” అంది శ్రీమతి టిట్ ఫర్ టాట్ అన్నట్టు.

శ్రీమతి చెప్పిన దాంట్లోనూ కొంత నిజం లేకపోలేదు. విశాఖపట్నం నుండి హైదరాబాదు వచ్చినవాడు ఏదో టైములో వీలు చూసుకుని అన్న వదినలనుచూసిపోతే ఎంత బాగుంటుంది? ఏమైనా అంటే ప్రొద్దున గోదావరి కొచ్చి సాయంత్రం గోదావరికి వెళ్ళిపోయానన్నయ్యా అంటాడు. మధ్యకాలమంతా ఆఫీసు పనితోనే గడిచిపోయిందంటాడు.

వాడు చెప్పేది నిజమే. వాడి ఆఫీసుకు- మా ఇంటికి పద్నాలుగు కిలో మీటర్ల దూరం. సిటీ బస్సు పట్టుకుంటే కనీసం గంట ప్రయాణం. రానూ పోనూ రెండు గంటలు. ఓ గంట ఉభయ కుశలోపరి. వెరసి మూడు గంటలు. హైదరాబాదులో వాడుండేది పది గంటలు. అందులో మూడు గంటలు మా కోసం వెచ్చించటమంటే కష్టమే మరి. అందుకనే వీలున్నప్పుడు గప్‌చిప్‌గా వచ్చి వెళ్ళాలి. దండోరా వేస్తున్నట్లు 'మీవూరొచ్చానహో' అంటూ ఉత్తరం వ్రాస్తాడు. అక్కడే దొరికిపోతాడు. సొంత తమ్ముడు కదాని తనెంత అడ్జస్ట్ అయినా ఈ లేడీస్‌కి నచ్చచెప్పడం అంత సులువైన పని కాదు.

* * *

“మీరు మాత్రం మీ తమ్ముడింటికి వెళ్తే ఊరుకోను. అన్న- వదినలమీద గౌరవం అతనికి లేనప్పుడు మీరెందుకు అతనింటికి వెళ్ళాలి? అతనికి మనం అక్కర్లేనప్పుడు మనమూ అలానే వుండాలి. మీరు మాత్రం...” ఆటో ఎక్కేంతవరకూ శ్రీమతి చెవిలో జోరీగలా శొద చేస్తూనే వుంది.

ట్రైనులో ప్రయాణం చేస్తున్నంతసేపూ నాకు ఇదే ఆలోచన. తమ్ముడింటికి వెళ్ళటమా? వెళ్ళక పోవటమా? వెళ్ళకపోతే అన్నయ్య రాలేదని వాడు బాధపడడూ? వాడికి అన్న- వదినల మీద గౌరవం లేకపోవడమేమిటి? ఏదో వీలవక ఇంటికి రాలేక పోయినంత మాత్రాన ప్రేమ లేదనుకుంటే ఎలా? అసలీ రోజులే అలా తయారయ్యాయి. కంప్యూటర్లు వచ్చాయన్నమాటే గాని, మనిషి జీవితం మునుపటికన్నా క్షణం తీరిక లేకుండా తయారయ్యింది. ఎప్పుడూ బిజీగానే వుండాల్సొస్తోంది. శరీరానికి- మనస్సుకు రెంటికీ విశ్రాంతి కరువయ్యింది. మనిషి జీవితం యాంత్రికంగా తయారైంది. రక్తసంబంధీకుల మధ్య కూడా రాకపోకలు తగ్గాయి. ప్రేమానురాగాలు పల్చబడ్డాయి. మొక్కుబడిగా క్షేమ సమాచారాలు తెల్పుతూ అప్పుడప్పుడూ ఉత్తరాలు వ్రాసుకోవడాలు, ఏ శుభకార్యం లోనో కల్సుకున్నప్పుడు ఒకర్నొకరు చూసుకోవడాలు- పలకరించుకోవడాలుతప్పిస్తే నిజమైన మమతానురాగాలు కొరవడ్డాయి. ఒకరింటికి వెళ్ళాలంటే సంకోచం- మనింటికి ఎవ్వరైనా వస్తున్నారంటే భయం. ఆర్థిక ఇబ్బందులు- ఇరుకు కొంపలు- రేషన్ సరుకులు- పెరుగు తున్న ధరలు- ఇవన్నీ కలిసి మనిషికి- మనిషికి మధ్య దూరాన్ని పెంచాయి. అయినా సరే పంతాలు- పట్టింపులు వదలం. ఫలానా అప్పుడు పిలిస్తే రాలేదనో- ఫలానా ఫంక్షన్‌కి మమ్మల్ని పిలవలేదనో దెప్పుళ్ళు- తప్పు పట్టడాలు- పిలవకపోతే పోయారు- ఖర్చు తగ్గిందని మనసులో అనుకుంటూనే. హిపోక్రసీ. మనసులో ఒకటి- మాటలో వేరొకటి. రోజులు మారాయి. మనుషులూ మారారు మరి.

ఎంతకూ ఆలోచన తెగడం లేదు. తమ్ముడింటికి వెళ్ళడమా? వెళ్ళకపోవడమా? అన్నదమ్ముల మధ్య పట్టింపులేంటి? కాని శ్రీమతికి తెలిస్తే? ఎలా తెలుస్తుంది? ఎలా ఏమిటి? తమ్ముడే రాస్తాడు. అన్నయ్యా మొన్న నువ్వు ఇంటికొచ్చినప్పుడు ఫలానాది మర్చిపోయావనో- మరేదో రాస్తాడు. వాడికి కపటం తెలీదు. ఫ్రాంక్‌గా వుంటాడు. ఈ రోజుల్లో అలా వుంటే పనికిరారు. ప్రతి మనిషిలో ఎంతో కొంత హిపోక్రసీ వుండాలి. డిప్లొమసీ రావాలి. అబద్ధం ఆడడం అవసరాన్ని బట్టి తప్పదు. అంటే లౌక్యం తెలియాలి. లేకపోతే ఇంతే సంగతులు!

* * *

ఇంటి దగ్గర ఆటో దిగుతుంటే శ్రీమతి ఎదురొచ్చి బ్రీఫ్ కేసు అందుకుంటుందేమోనని భయపడ్డాను. అలా జరగలేదు. నేనే వెళ్ళి తలుపు కొట్టాక కాని శ్రీమతి తలుపు తెరవలేదు.

నన్ను చూసి “అప్పుడే వచ్చేశారా- ఎనిమిదైతే కాని రారనుకున్నా” అంది శ్రీమతి.

“మే ఫస్ట్ నుంచి ట్రైన్ టైమింగ్స్ మారినయ్‌గా” అన్నాను సోఫాలో కూర్చుంటూ.

“ఏమిటి సంగతులు? మీ తమ్ముడు- మరదలు కులాసానా?” అంది.

తమ్ముడింటికి వెళ్ళొద్దని ఆర్డరేసిన శ్రీమతి ఇలా అడుగుతుంటే 'ఓహో నన్ను టెస్టు చేస్తుంది కాబోలను కున్నాను.

“ఏం మతిగాని పోయిందా? నువ్వంతగా చెప్పాక తమ్ముడింటికి ఎలా వెళ్తాననుకున్నావ్?” గట్టిగానే అడిగాను.

“సోనీ ఫోనులో మాట్లాడొచ్చుగా?”



"ఏం తిక్కగా వుందా? వెళ్ళద్దన్నది మన్వే! ఫోన్లో మాట్లాడకపోయారా అనేగ నువ్వే. ఏదో ఒక మాట మీద వుండాలి" విసుక్కున్నాడు.

"ఓహో- మీరూ మీ తమ్ముడిలాగానే మాట్లాడుతున్నారే. అతనంటే చిన్నవాడు. మీరు కూడానా! అయినా నేను వెళ్ళద్దంటే మాత్రం మీ తమ్ముడింటికి వెళ్ళడం మానేస్తారా? వదిన ఏరాయిది కనుక అలా చెప్పింది అనుకోరూ? నా మాట మీద మీరు మీ తమ్ముడింటికి వెళ్ళడం మానేస్తే మీ ఇంగితం ఏమైనట్టు? మీరేదో తెలివైన వారనుకున్నాను. అంత దూరం వెళ్ళి సొంత తమ్ముడ్ని చూడకుండా వచ్చారంటే మీకు మీ తమ్ముడి మీద ఎంత 'ఎఫెక్షన్' వుందో అర్థం అవుతూందండీ! మొగుడు పెళ్ళాం మాట వినొచ్చు. కాదనను. కాని మంచి- చెడు విచక్షణ వుండాలి మగాడన్నవాడికి. మీ కంటే నేనే నయం. ఆవేశంలో కోపం వచ్చినా, తర్వాత అర్థం చేసుకోగల్ను. మీలా బండరాయిని మాత్రం కాను!"

శ్రీమతి కళ్ళల్లో నీళ్ళు. నాకేం పాలుపోవడం లేదు. ఈ ఆడవాళ్ళను అర్థం చేసుకోవడం ఎవ్వరి తరం కాదు. "ఔనంటే కాదనిలే- కాదంటే ఔననిలే" అని ఊరికే అన్నాడా సినీ కవి! ప్రతిదీ చాలా సెన్సిటివ్‌గా ఆలోచిస్తారు. సెంటిమెంట్స్‌తో ముడిపెడ్తారు. కోపం నటించిన కళ్ళల్లోనే కరుణరసం చూపిస్తారు.

నేను అనుకున్న టైమ్ అయ్యింది.

తలుపు కొడ్తున్న శబ్దం వినిపడింది. "కమిన్" గట్టిగా అరిచాను. తలుపు తెరచుకుంది. ఎదురుగా తమ్ముడు.

శ్రీమతి కళ్ళల్లో మెరుపు. ఆనందం- ఆశ్చర్యం.

తమ్ముడొచ్చి- వదిన పాదాలకువంగి నమస్కారం చేశాడు.


"అవును- ఇద్దరం కలిసే వచ్చాం. 'మీ వదినకు నీ మీద కోపం వచ్చిందిరా' అన్నాను మొన్న వాడింటికి వెళ్ళినప్పుడు. 'పద అన్నయ్యా నేను కూడా వస్తున్నాను హైదరాబాదుకి' అంటూ నాతో వచ్చేశాడు. నీ మూడ్ ఎలా వుంటుందో తెలుసుకున్నాక వాడొస్తే బాగుంటుందని ఇద్దరం ఆటో దిగాక, వాడ్ని ఓ పది నిముషాలు బైట వేచి వుండమన్నాను" అసలు విషయం చెప్పేశాను.

శ్రీమతికి నా మీద- తమ్ముడి మీద వచ్చిన కోపం తుర్రుపిట్టలా ఎగిరిపోయింది.

"నన్ను క్షమించండి" అంటూ తప్పు చేసిన దానిలా తల దించుకుంది.

"నో క్షమించడాలూ- గిమించడాలూ మై డియర్. మనమంతా ఒక్కటే- తాత్కాలికంగా వచ్చి పోయే కోపతాపాలే మన మధ్య గల మమతానురాగాలకు పరీక్షలు. ప్రేమ నుంచీ కోపం పుడుతుంది. ఆ కోపం వల్లే ప్రేమ పెరుగుతుంది. మన మనసులు మంచివైతే మనకంతా మంచే జరుగుతుంది. ఈ సంతోష సమయంలో నాదొక సజెషన్. తమ్ముడెలాగో వచ్చాడు కనుక మరదల్ని కూడా ఈ రోజే బయల్దేరి రమ్మని ఫోన్ చేసి చెప్దాం. నల్గురం నాల్గు రోజులు సరదాగా గడిపేద్దాం" అన్నాను.

"మీ మాటెప్పుడైనా నేను కాదన్నానా?" అంటూ సిగ్గుపడింది శ్రీమతి.



# బి.యన్. రెడ్డితో బెంగాలీ దర్శకుడు దేవకీ బోస్

తెలుగు చిత్రాలకు అంతర్జాతీయ ఖ్యాతి నార్జించి పెట్టిన కళా తపస్వి బి.యన్. రెడ్డిగారు అనుకోకుండా చిత్ర పరిశ్రమకు వచ్చారు. ఆయన ఇంటర్ పాసయ్యాక 'శాంతినికేతన్' వెళ్ళారు. రవీంద్రనాథ్ ఠాగూర్‌తో కొద్ది రోజులు గడిపారు. ఎన్నో బెంగాలీ నాటకాలు చూసారు. 'శాంతినికేతన్' (కలకత్తా)లోనే బి.ఎ. చద వాలనుకున్నారు. కానీ వాళ్ళ నాన్నగారు ఆయన చేత చార్టర్డ్ ఎకౌంటెన్సీ చదివించారు. ఇష్టంలేకపోయినా అలా సి.ఎ. చదివారు. పాసయ్యారు. కొద్ది రోజులు మద్రాసు శాస్త్రి అండ్ షాలో అప్రెంటిస్‌గా కూడా వున్నారు. అలా త్వరలోనే ప్రాక్టీస్ పెట్టి చార్టర్డ్ ఎకౌంటెంట్‌గా లక్షలు ఆర్జించవలసిన బి.యన్., సినీ రంగానికొచ్చి జీవితాంతం ఆదర్శాలకే నిలబడి, కళాత్మక చిత్రాలే తీసి, ఎన్నోసార్లు లక్షలు నష్టపోయారు. అయితే 30 సంవత్సరాల కాలంలో కేవలం 11 చిత్రాలే తీసి, ఎవ్వరూ పొందని శాశ్వత కీర్తి పొందారు. ఫాల్కే అవార్డు, పద్మ భూషణ్, డాక్టరేట్ పొందారు. 'మల్లీశ్వరి'తో అంతర్జాతీయ ఖ్యాతి పొందారు. మరి ఆయన ఎలా సినిమాలలోకి వచ్చారు?

మద్రాసులో చార్టర్డ్ ఎకౌంటెన్సీ పరీక్షలు వ్రాసే కాలంలో కొంచెం రిలీఫ్ కోసం 'సీత' అనే బెంగాలీ చిత్రానికి మ్యాట్నీకి వెళ్ళారు. అంతే! ఆ చిత్రాన్ని ఆ రోజు వరుసగా మూడు ఆటలు చూసారు. ఆ చిత్రం తీసింది దేవకీకుమార బోస్. ఆయన్ను గురువుగా భావించి తానూ చిత్రసీమకు వచ్చారు బి.యన్. రెడ్డి. అయితే బి.యన్. అప్పటికే గొప్ప నటుడు. బళ్ళారి రాఘవతో 'చంద్రగుప్త', 'బొబ్బిలి యుద్ధం'లలో నటించేవారు. ఒకసారి మద్రాసులో ఆడిన 'పరవిక్రయం' తెలుగు నాటకంలో బి.యన్. నటిస్తుంటే, కాశీనాథుని నాగేశ్వరరావుగారు గాంధీ మహాత్ముని తీసుకొచ్చారు. గాంధీజీని ప్రేక్షకులలో చూసి బి.ఎన్. పొంగిపోయారు. తర్వాత నాటకం కాగానే గాంధీ మహాత్ముడు బి.యన్.ను అభినందించారు. అప్పటికే బి.యన్. ఖద్దరు ధరించి, కాంగ్రెస్ ఉద్యమంలో వున్నారు.

ఇక సినీరంగం: సీత' చూసి దేవకీబోస్‌ను గురువుగా ఈయన భావిస్తే, దేవకీబోస్ 'బి.ఎన్. నాకే గురువు' అనేవారు. 'బంగారు పాప' చిత్రాన్ని బోస్ బెంగాలీలో 'సోనర్‌కాఠి'గా తీసారు కూడా. అలాగే ఒక మద్రాసు నిర్మాత కలకత్తా వెళ్ళి దేవకీబోస్‌ను 'సీత'ను తెలుగులో తియ్యమని కోరాడు. "మద్రాసులో బి.యన్. వుండగా మీరు ఇంత దూరం కలకత్తాకు రావడం అవివేకం" అన్నారు దేవకీబోస్ ఆ నిర్మాతతో.

ఆ నిర్మాత 'సీత' తియ్యలేదు. కాని బి.యన్. సోదరుడు నాగిరెడ్డి తమ విజయా సంస్థ తరఫున బి.యన్. దర్శకత్వంలో 1955లో (సీత) తీయాలనుకున్నారు. ప్రకటించి సంతోషించాడు. మైసూరు చాముండేశ్వరీ ఆలయంలో కూర్చుని బి.యన్. రెడ్డి ఎంతో పవిత్రంగా స్క్రిప్టు తయారు చేసారు. అప్పుడు నేను ఇంటర్ చదివే విద్యార్థిని. కానీ వయసులో ఎంతో పెద్దవారైనా, అప్పటికే ఆయన నాకు ప్రాణ మిత్రులు. ఆ 'సీత' స్క్రిప్టులో నేనూ సలహాలిచ్చాను. బి.యన్. వాటిని చేర్చారు. కానీ ఆ చిత్రం తీయనేలేదు. తర్వాత శంకరరెడ్డిగారు రంగులలో 'లవకుశ' (1963) తీసి కోట్లు సంపాదించారు.

చివరి దశలో ఆ 'సీత' (లవకుశ) వాహినీ సంస్థకు (తమ స్వంత సంస్థ) 1974లో తీయాలన్నారు. అదీ కుదరలేదు. తర్వాత ఆ స్క్రిప్టును ఎందుకో ఎన్.టి. రామారావుకు చూపారు. బి.ఎన్. 1977 నవంబర్ 8న అస్తమించినపుడు ఎన్.టి. రామారావుగారు రేడియోలో ప్రసంగిస్తూ "బి.యన్. దర్శకత్వంలోనే ఆయనకిష్టమైన 'సీత' తీయాలనుకున్నాను, కానీ అది నెరవేరకుండానే ఇంత త్వరలో ఆయన మనకు దూరమౌతారనుకోలేదు" అన్నారు గద్గద కంఠంతో.




"బ్రహ్మర్షి విశ్వామిత్ర" తర్వాత ఎన్.టి.ఆర్. నిజంగా బి.ఎన్.గారి స్క్రిప్టు 'సీత' తీస్తే ఆయన బి.ఎన్. ఋణం తీర్చుకున్నట్లవుతుంది. అలాగే బి.ఎన్. వ్రాసిన స్క్రిప్టులు 'శంకరాచార్య', 'రామానుజాచార్య', 'జన్మభూమి' (కృష్ణరాయల కాలపు చరిత్రాత్మకం-అద్భుత గాథ-1967లో 'రంగులరాట్నం' తర్వాత తీయాలనుకున్నారు), 'సౌందరనందం' 'పుణ్యభూమీ కళ్ళు తెరు', (బీనాదేవి నవల)- ఇవి ఏ నిర్మాత తీసినా బాగుంటుంది. కనీసం దేవకీబోస్ స్మృతి చిహ్నంగా కళాతపస్వి బి.ఎన్. రెడ్డి తయారుచేసిన 'సీత' (లవకుశ)ను ఎన్.టి. రామారావుగారు వెలుగులోకి తీసుకురావాలి. అప్పుడే తెలుగువారు బి.ఎన్. ఋణం తీర్చుకున్నట్లవుతుంది.

— డాక్టర్ మల్లిప్రియ 'నాగరాజు'